క్లుప్తంగా

రంగారెడ్డికి సన్మానం



నెల్లూరు రూరల్: నగరంలోని ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి నివాసంలో విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డిని ఏపీఎంఎస్ఎంత డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన పాశం శ్రీనివాస్ గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. రంగారెడ్డిని శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు.

మత్తు పదార్థాలతో జీవితాలు నాశనం



నెల్లూరు(బృందావనం): విలువైన జీవితాలను సర్వనాశనం చేసే మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని జమాతె ఇస్లామి హింద్ నెల్లూరు నగర శాఖ ఉపాధ్యక్షుడు జనాబ్ అబుల్‌హసన్ సూచించారు. జెండావీధిలోని జమాతె ఇస్లామి హింద్ నగర శాఖ కార్యాలయంలో రాష్ట్రస్థాయిలో నిర్వహిస్తున్న యాంటీ డ్రగ్స్ ఉద్యమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను గురువారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అబుల్‌హసన్ మాట్లాడుతూ మత్తు పదార్థాల వినియోగంతో కలిగే అనర్థాలను వివరించారు. మత్తు పదార్థాలపై యువత చైతన్యవంతం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు సిరాజ్, ఖయ్యూంబాషా, సందాని, అబ్దుల్‌సమి, నవీద్, సాజిద్, షాహిర్, అయాజ్, మొయినుద్దీన్ పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు తెలపొచ్చు


కోవూరు : నియోజకవర్గానికి సంబంధించిన ఓటర్ల జాబితాలో అభ్యంతరాలు ఉంటే తెలపొచ్చని ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం శ్రీనివాసులు అన్నారు. కోవూరు తహసీల్దార్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో గురువారం ఆయన ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన వారు ఉంటే ఓటు నమోదు చేసుకోవచ్చన్నారు. కుటుంబ సభ్యులందరూ ఒకే పోలింగ్ స్టేషన్ పరిధిలోకి వచ్చేలా తగిన జాగ్రత్తలు తీసుకున్నట్లు తెలిపారు. ఈ జాబితాను రాజకీయ పార్టీలు పరిశీలించి ఇంకా ఏమైనా తప్పులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. తహసీల్దార్ విజయశ్రీ, మండల ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ మధు పాల్గొన్నారు.

పది పరీక్షలపై ఆందోళన వద్దు



కోవూరు : విద్యార్థి జీవితంలో పదో తరగతి పరీక్షలు అత్యంత కీలకమని, పరీక్షలు రాసే సమయంలో ఆందోళన వద్దని వ్యక్తిత్వ వికాస నిపుణుడు కోదండరామయ్య అన్నారు. కోవూరులోని పచ్చిపాల రామనాథమ్మ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల సమావేశ మందిరంలో పదో తరగతి విద్యార్థులకు మోటివేషన్ తరగతులను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు చెప్పే అంశాలను పూర్తిగా ఆకళింపు చేసుకోవాలన్నారు. ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని ఎంచుకుని ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. పరీక్షలపై బెరుకుతనం, ఆందోళనలు పక్కన పెట్టి ఇచ్చిన ప్రశ్నపత్రాలను ఒకటికి రెండు సార్లు చదువుకోవాలని సూచించారు. కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలని, టీవీలు, సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలన్నారు. అనంతరం కోదండరామయ్యను సన్మానించారు. పాఠశాల హెచ్‌ఎం నరసింహమూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యాయామంపై దృష్టి సారించాలి



కోవూరు : ప్రాథమిక దశ నుంచి ప్రతి విద్యార్థి వ్యాయామంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఫిజికల్ డైరెక్టర్ దేవిక సూచించారు. కోవూరులోని పచ్చిపాల రామనాథమ్మ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో విద్యార్థులకు వ్యాయామంపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యాయామం వల్ల శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండవచ్చని తెలిపారు. విద్యార్థుల్లో బెరుకుతనం పోయి చురుకుతనం వస్తుందన్నారు. అదేవిధంగా ప్రతి విద్యార్థి వారికి నచ్చిన క్రీడలపై కూడా దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో పీఈటీ వెంకటసుబ్బమ్మ పాల్గొన్నారు.

సీసీసీ ద్వారా మెరుగైన పౌరసేవలు



కమాండ్ కంట్రోల్ సెంటర్ సిబ్బందితో మాట్లాడుతున్న మేయర్ స్రవంతి

- నగర మేయర్ స్రవంతిజయవర్ధన్

నెల్లూరు(బారకాసు): కమాండ్ కంట్రోల్ సెంటర్ (సీసీసీ)ద్వారా నగర ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అవకాశం కలిగిందని నగర మేయర్ పొట్లూరి స్రవంతి జయవర్ధన్ పేర్కొన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయ ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను గురువారం మేయర్ సందర్శించారు. అందులోని వివిధ విభాగాలను పరిశీలించి వాటి పనితీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం మేయర్ మాట్లాడుతూ కార్పొరేషన్ ప్రాంగణంలో రూ.8.5 కోట్లతో రాష్ట్రంలోనే అతిపెద్ద కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను నిర్మించినట్లు తెలిపారు. ఈ కేంద్రం ద్వారా ప్రజలు, మీడియా ద్వారా వచ్చే ఫిర్యాదులను నిర్ణీత సమయంలో పరిష్కరించేందుకు అవకాశం కలిగిందన్నారు. సీసీసీలో పారిశుధ్య పనులను నిరంతరం పర్యవేక్షించే సాంకేతికతను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. తద్వారా మెరుగైన పారిశుధ్యం అందించే అవకాశం కలుగుతుందన్నారు. స్పందన ఫిర్యాదులు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలును పర్యవేక్షించేందుకు అవకాశం కలిగిందన్నారు. కార్పొరేషన్ పరిధిలో ఏమైనా సమస్యలు ఉంటే 18004251113, 14420 టోల్‌ఫ్రీ నంబర్లకు ఫిర్యాదు చేస్తే వేగవంతంగా పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. కార్పొరేటర్లు విజయలక్ష్మి, వాసంతి, కో–ఆప్షన్ సభ్యురాలు మొబీనా, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

ఇంటర్ ప్రాక్టికల్స్‌ను పకడ్బందీగా నిర్వహించాలి



ఆర్ఐఓకు వినతిపత్రం అందజేస్తున్న జేఏసీ నాయకులు

నెల్లూరు(టౌన్): ఇంటర్ ద్వితీయ సంవత్సరం ప్రాక్టికల్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ విద్యార్థి జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదిత్యసాయి కోరారు. ఈ మేరకు నగరంలోని ఇంటర్ బోర్డు కార్యాలయంలో ఆర్ఐఓ శ్రీనివాసులును గురువారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు ప్రాక్టికల్ పరీక్షల్లో ఎక్కువ మార్కుల కోసం ప్రలోభాలకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఈ ఏడాది జంబ్లింగ్ విధానం లేకుండా ఆయా కళాశాలల్లో పరీక్షలు నిర్వహిస్తున్నందున ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు అవకతవకలకు పాల్పడే అవకాశం ఉందన్నారు. అందువల్ల సీసీ కెమెరాలతో పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు గోపి, శ్రీకాంత్, సంతోష్ పాల్గొన్నారు.

మాజీ రాష్ట్రపతి జాకీర్‌హుస్సేన్‌కు ఘన నివాళులు



జాకీర్‌హుస్సేన్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): మాజీ రాష్ట్రపతి జాకీర్ హుస్సేన్ 127వ జయంతిని పురస్కరించుకుని వెంకటేశ్వరపురం సెంటర్‌లోని ఆయన కాంస్య విగ్రహానికి ఆవాజ్ కమిటీ, ప్రజాసంఘాల నాయకులు గురువారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆవాజ్ కమిటీ జిల్లా కార్యదర్శి రషీద్ మాట్లాడుతూ స్వాతంత్ర్యసమరయోధుడిగా, రాష్ట్రపతిగా జాకీర్‌హుస్సేన్ దేశానికి అందించిన సేవలను స్మరించుకున్నారు. భారతరత్న బిరుదును అందుకున్న గొప్ప విద్యావేత్త జాకీర్ హుస్సేన్ అని కొనియాడారు. ఆయన జయంతి, వర్ధంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహించాలని కోరారు. సీపీఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, ఆవాజ్ కమిటీ జిల్లా సభ్యులు చాన్‌బాషా, నాయకులు రవూఫ్, రియాజ్, సీపీఎం నాయకులు మూలం ప్రసాద్, దస్తగిరి,బాబు, తదితరులు పాల్గొన్నారు.

ఈ–క్రాప్ నమోదు తప్పనిసరి



ఈ–కేవైసీ నమోదును పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

నెల్లూరు రూరల్: ఈ–క్రాప్ నమోదు రైతులకు బాసటగా నిలుస్తుందని నెల్లూరు ఏడీఏ శ్రీనివాసులు, రూరల్ ఏఓ నాగమోహన్ పేర్కొన్నారు. నెల్లూరు రూరల్ మండలం గొల్లకందుకూరు, వెల్లంటి, ములుముడి గ్రామాల్లో గురువారం వారు పర్యటించి వరి పంటను పరిశీలించారు. రైతుల ఈ–కేవైసీ నమోదును పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు సాగు చేసిన పంటల వివరాలను ఈక్రాప్‌లో నమోదు చేసుకోవడంతో పాటు ఈ–కేవైసీ చేయించుకోవాలని సూచించారు. ఈ–క్రాప్ నమోదు చేసుకుంటే పంట నష్టం జరిగిన సమయంలో ప్రభుత్వం సాయం చేస్తుందన్నారు. అనంతరం వరిసాగులో యాజమాన్య పద్ధతులను రైతులకు వివరించారు.

11న నృత్య, పాటల పోటీలు



కళానీరాజనం ఆహ్వానపత్రికలను ఆవిష్కరిస్తున్న సుబ్బారావు

నెల్లూరు(బృందావనం): న్యూరాజ్యలక్ష్మి హాల్, శుభమస్తు షాపింగ్‌మాల్ వ్యవస్థాపకులు బీవీ రమణయ్య, సరోజనమ్మ స్మృత్యార్థం నగరంలోని పురమందిరంలో ఈ నెల 11న కళానీరాజనం నిర్వహిస్తున్నట్లు కేతా అంకులు మెమోరియల్‌ట్రస్ట్ అధ్యక్షుడు కేతా సుబ్బారావు తెలిపారు. అందుకు సంబంధించిన ఆహ్వానపత్రికలను పురమందిరం ప్రాంగణంలో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శుభమస్తు షాపింగ్‌మాల్ అధినేతలు బయ్యా శ్రీనివాసులు, వెంకటరవికుమార్ సహకారంతో కళానీరాజనం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వర్ధమాన కళాకారుల ప్రతిభను వెలుగుతోకి తీసుకురావాలన్న సంకల్పంతో ఉదయం 10 నుంచి రాత్రి 10గంటల వరకు పాటలు, నృత్య పోటీలు నిర్వహించి విజేతలకు ప్రోత్సాహక బహుమతులు అందజేయనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ప్రముఖ ఆర్కెస్ట్రాల నిర్వాహకులు రాజశేఖర్, పెంచలరెడ్డిని ఘనంగా సత్కరించి కళాసామ్రాట్ పురస్కారాలను ప్రదానం చేయనున్నట్లు చెప్పారు. అరిగెపూడి విజయకుమార్ ఆశీస్సులతో సుస్వర, లక్కీ ఆర్కెస్ట్రాలచే మ్యూజికల్ నైట్ నిర్వహిస్తున్నామని తెలిపారు. కళాభిమానులు వీక్షించి జయప్రదం చేయాలని కోరారు. పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తి కలిగిన వర్ధమాన కళాకారులు 77299 42543 నంబరులో సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అమానుల్లాఖాన్, మాబాషా, రఘురామిరెడ్డి పాల్గొన్నారు.

15,16న రథసప్తమి వేడుకలు



ఆహ్వానపత్రికలు ఆవిష్కరిస్తున్న ట్రస్టు సభ్యులు

నెల్లూరు(బృందావనం): రథసప్తమిని పురస్కరించుకుని ఈ నెల 15,16 తేదీల్లో నగరంలోని సుజాతమ్మ కాలనీలోని అవధూత దత్తపీఠం నెల్లూరు శాఖకు చెందిన శ్రీకృష్ణయోగ, శ్రీఅష్టలక్ష్మి మందిరంలో విశేష పూజలు, హోమాలు నిర్వహించనున్నట్లు ఎస్జీఎస్కేజీబీఎస్ ట్రస్టు ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ సర్వేపల్లి అజయ్‌కుమార్ తెలిపారు. గురువారం శ్రీకృష్ణయోగ, శ్రీఅష్టలక్ష్మి మందిరం ప్రాంగణంలో రథసప్తమి ఆహ్వానపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైసూరు అవధూత దత్తపీఠ ఉత్తరాధీశ్వరులు దత్త విజయానందతీర్థస్వామి దివ్య సమక్షంలో ఈ నెల 15న ఉదయం 10గంటలకు శ్రీసూక్త యాగం, శ్రీచక్రార్చన, సాయంత్రం 6.30 గంటలకు దివ్యనామ సంకీర్తనలు నిర్వహించనున్నట్లు తెలిపారు. రథసప్తమిని పురస్కరించుకుని ఈ నెల 16న ఉదయం 6గంటలకు రథసప్తమి పూజ, ఆదిత్య హృదయపారాయణం, 10 గంటలకు శ్రీచక్రార్చన, మహాసౌర హోమం, సాయంత్రం 5గంటలకు సరస్వతిపూజ, 6గంటలకు దివ్యనామ సంకీర్తన, తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు. సరస్వతి పూజలో పాల్గొనే విద్యార్థులకు పెన్నులు అందజేయనున్నట్లు తెలిపారు. ప్రతిరోజూ మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ చేయనున్నట్లు వివరించారు. భక్తులు విశేషంగా పాల్గొని స్వామి అనుగ్రహభాషణలను ఆలకించి, మంగళాశాసనాలు అందుకోవాలని కోరారు. ట్రస్టు సభ్యులు మస్తాన్‌రెడ్డి, సీసీ రత్నం, కొల్లం సురేష్, తదితరులు పాల్గొన్నారు.

రేపు ఎస్టీయూ జిల్లా కౌన్సిల్ సమావేశం

నెల్లూరు(టౌన్): నగరంలోని రామకోటయ్య భవన్‌లో ఈ నెల 10న ఎస్టీయూ 77వ జిల్లా కౌన్సిల్ సమావేశాలను నిర్వహించనున్నట్లు ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు రాజమనోహర్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని మండలాల ప్రతినిధులు, సంఘ బాధ్యులు, జిల్లా బాధ్యులు పాల్గొని జిల్లా కౌన్సిల్ సమావేశాలను విజయవంతం చేయాలని కోరారు.

అక్కపై దాడి..ఇంటికి నిప్పు

నెల్లూరు(క్రైమ్): ఆర్థిక విభేదాల నేపథ్యంలో అక్కపై తమ్ముడు దాడి చేయడమే కాకుండా ఆమె ఇంటికి నిప్పు అంటించాడు. ఈ ఘటన ఫత్తేఖాన్‌పేటలో గురువారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు..ఫత్తేఖాన్‌పేటకు చెందిన సురేఖ, కిషోర్ అక్కాతమ్ముడు. వీరు ఒకే ప్రాంతంలో వేర్వేరుగా నివాసం ఉంటున్నారు. వీరి మధ్యన ఆర్థిక విభేదాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో కిషోర్ తన అక్కపై దాడి చేయడమే కాకుండా ఆమె ఇంటికి నిప్పంటించాడు. ఈ మేరకు బాధితురాలు చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై సైదులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉపకారవేతనాల పంపిణీ



నెల్లూరు(టౌన్):నగరంలోని డీకేడబ్ల్యూ జూనియర్ కళాశాలలోని విద్యార్థినులకు గురువారం ఉపకారవేతనాలు పంపిణీ చేశారు. మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ ఆధ్వర్యంలో 58 మంది విద్యార్థినులకు రూ.5.12 లక్షలు అందజేశారు. ఈ కార్యక్రమానికి అసిస్టెంట్ కలెక్టర్ సంజనాసింహా ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థినులకు ఉపకారవేతనాలు ఆర్థిక ఆసరాను అందించడంతో పాటు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో మలబార్ గోల్డ్ షోరూం హెడ్ షాహిల్, ప్రిన్సిపల్ శ్రీనివాసరావు, వైస్‌ప్రిన్సిపల్ రవీంద్రనాథ్, అధ్యాపకులు వెంకటేశ్వర్లు, రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

డీఈఓను కలిసిన ఆపస్ నాయకులు



నెల్లూరు(టౌన్): జిల్లా విద్యాశాఖ అధికారిగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన రామారావును ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘ నాయకులు గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. డీఈఓను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఆపస్ జిల్లా అధ్యక్షుడు రాజగోపాలాచార్యులు, ప్రధాన కార్యదర్శి అనిల్, రాష్ట్ర గౌరవ సలహాదారుడు రమేష్‌బాబు, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి రాజేశ్వరరావు, ఉపాధ్యక్షుడు రమణారెడ్డి, గౌరవ సలహాదారుడు రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు మాదిగల యుద్ధభేరి మహాసభ



నెల్లూరు(వేదాయపాళెం): మాదిగల హక్కులు, రాజకీయ ప్రాధాన్యత కోసం నగరంలోని నర్తకి సెంటర్‌లో శనివారం మాదిగల యుద్ధభేరి మహాసభను నిర్వహిస్తున్నట్లు సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పందిటి సుబ్బయ్య తెలిపారు. దర్గామిట్టలోని అంబేడ్కర్ భవన్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మధ్యాహ్నం 3 గంటలకు నగరంలోని ఏబీఎం స్కూల్ నుంచి ప్రదర్శన, సాయంత్రం 4 గంటలకు బహిరంగ సభ జరుగుతుందని వివరించారు. ఈ సభకు అన్ని రాజకీయ పార్టీల నేతలను ముఖ్యఅతిథులుగా ఆహ్వానిస్తున్నామని చెప్పారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో మాదిగలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించే పార్టీలకే తమ మద్దతు ఉంటుందన్నారు. జిల్లాలోని మాదిగ సంఘీయులందరూ మహాసభకు హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ యునైటెడ్ ఫోరం అధ్యక్షుడు కుడుముల సుబ్బారావు, ఎమ్మార్పీఎస్ నేతలు బద్దేపూడి వెంకట్రావు, వెంకటరమణయ్య, రాజు, సాల్మన్, హరి, తదితరులు పాల్గొన్నారు.

నేడు శ్రీవారి కల్యాణోత్సవం



శ్రీవారి కల్యాణోత్సవ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కర్తం ప్రతాప్‌రెడ్డి

నెల్లూరు(బృందావనం): శ్రీవారి జన్మనక్షత్రం శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని లోక కల్యాణార్థం శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాన్ని పద్మావతినగర్‌లోని శ్రీసాయిదర్బార్ అద్దాల మందిరం వద్ద శుక్రవారం నిర్వహించనున్నట్లు ఆ కార్యక్రమ నిర్వాహకుడు, 14వ డివిజన్ కార్పొరేటర్ కర్తం ప్రతాప్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన శ్రీవారి కల్యాణ మహోత్సవ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికాస్ ప్రజాహిత సేవా సమితి ఆధ్వర్యంలో 13వ పర్యాయం శ్రీవారి కల్యాణమహోత్సవాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. అందులో భాగంగా ఉదయం బాలాజీనగర్‌లోని సీతారామస్వామి మందిరంలో శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామికి విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించనున్నట్లు చెప్పారు. అనంతరం సీతారామస్వామి మందిరం నుంచి దేవదేవేరుల ఉత్సవమూర్తులను ఊరేగింపుగా కల్యాణ వేదిక వద్దకు తీసుకెళ్లి కొలువుదీర్చి సాయంత్రం 5.30 గంటలకు కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం భక్తులకు కల్యాణ ముత్యాల తలంబ్రాలు, కంకణాలు, తిరుమల లడ్డూ ప్రసాదాలను వితరణ చేయనున్నట్లు చెప్పారు. వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు కల్యాణోత్సవానికి రానున్నారని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



నెల్లూరు(బారకాసు): సీసీరోడ్ల నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని 32వ డివిజన్ కార్పొరేటర్ తాళ్లూరు అవినాష్ ఇంజినీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్‌కు సూచించారు. 32వ డివిజన్ న్యూ ఎన్‌సీసీ కాలనీ 4వ వీధిలో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల్లూరు రూరల్ నియోజక వర్గ పరిధిలోని అన్ని డివిజన్లు శరవేగంగా అభివృద్ధి చెందుతున్నాయన్నారు. నెల్లూరు ఎంపీ, రూరల్ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధతో రూ.150 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. త్వరలో జరగబోయే ఎన్నికల్లో నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా అత్యధిక మెజార్టీతో ఆదాల ప్రభాకర్‌రెడ్డి విజయం సాధిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు మంజూరు, ప్రసాద్, ఫిలిప్స్, షమ్మీ, అంజాద్, బాజీ, షబ్బు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

యాత్ర–2 చాలా బాగుంది



మాట్లాడుతున్న ఖలీల్‌అహ్మద్

- నగర నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి ఖలీల్‌అహ్మద్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): యాత్ర–2 సినిమా చాలా బాగుందని నగర నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి, డిప్యూటీ మేయర్ ఖలీల్‌అహ్మద్ పేర్కొన్నారు. గురువారం యాత్ర–2 సినిమా విడుదల సందర్భంగా నగరంలోని ఎస్–2 థియేటర్ వద్ద నగర నియోజకవర్గ కార్పొరేటర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి బాణసంచా కాల్చి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఖలీల్‌అహ్మద్ మాట్లాడుతూ దివంగత సీఎం వైఎస్సార్ సంక్షేమ పాలనతో తెలుగు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. ఆయన బాటలోనే తనయుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నడుస్తూ సంక్షేమ పాలనతో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో పయనింపజేస్తున్నారన్నారు. కార్పొరేటర్లు నీలిరాఘవరావు, వేనాటి శ్రీకాంత్‌రెడ్డి, మొగుళ్లపల్లి కామాక్షిదేవి, గుంజి జయలక్ష్మి, ఏపీ ఆగ్రో డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొణిదెల సుధీర్, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులను విలీనం చేయాలి



ఎస్ఈ విజయన్‌కు వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ నాయకులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): విద్యుత్ సంస్థలో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులందర్నీ అందులో విలీనం చేయాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్రాధ్యక్షుడు సూరిబాబు కోరారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నగరంలోని విద్యుత్‌భవన్ వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాతషిప్ట ఆపరేటర్లకు ఇస్తున్న వేతనాలను కొత్త షిఫ్ట ఆపరేటర్లకు ఇవ్వాలన్నారు. మీటర్ రీడర్లకు ఉద్యోగభద్రత కల్పించి కనీస వేతనం అందజేయాలని, రెగ్యులర్ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసి పెండింగ్‌లో ఉన్న డీఏ, అరియర్స్‌ను చెల్లించాలని, జేఎల్ఎం(గ్రేడ్–2)లకు ప్రొబేషన్ డిక్లర్ చేసి రెగ్యులర్ జేఎల్ఎంలకు వర్తిస్తున్న అన్ని సదుపాయాలను కల్పించాలని కోరారు. అనంతరం ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ విజయన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ, యూఈఈయూ, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు ప్రసాద్, జాకీర్‌హుస్సేన్, పెంచలప్రసాద్, హరి నారాయణ, సుమన్, విజయరామిరెడ్డి, కొండయ్య, నజీర్, సునీల్, ఆరీఫ్, తదితరులు పాల్గొన్నారు.